## క్లుప్తంగా

### సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

**ములుగు రూరల్:** విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్నాథం అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. క్యాష్‌లెస్ వైద్యానికి ప్రభుత్వం హెల్త్ కార్డులను అందించాలని అన్నారు. సీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

**వాజేడు:** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను అధికారులు మంగళవారం పరిశీలించారు. గ్రామాల వారిగా వచ్చిన దరఖాస్తులను రైతుల సమక్షంలో పరిశీలన చేయడంతో పాటు సమస్య చిన్నదైతే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఇతర సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారం చేస్తామని అధికారులు తెలిపారు.

### వైద్యుడిపై చర్య తీసుకోవాలి


ధర్నా చేస్తున్న బాధితురాలి బంధువులు

**ములుగు రూరల్:** ఆరోగ్యం సరిగా లేక ప్రైవేట్ వైద్యుడిని సంప్రదిస్తే ప్రాణం మీదికి వచ్చిందని అతడిపై చర్య తీసుకోవాలని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని స్రవంతి ఆస్పత్రిలో ఈ నెల 12న నల్లబెల్లి మండలం ముచ్చింపులతండా గ్రామానికి చెందిన కేలోత్ సంధ్యారాణి అనారోగ్యానికి గురికావడంతో జిల్లా కేంద్రంలోని స్రవంతి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి గర్భసంచి ఆపరేషన్ చేశారన్నారు. వైద్యం వికటించడంతో గుట్టుచప్పుడు కాకుండా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని అన్నారు. ప్రస్తుతం మహిళ ప్రాణాపాయ స్థితిలో ఉందని తెలిపారు. కనీస వసతులు లేకుండా ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేస్తున్న వైద్యుడు డాక్టర్ గోపిసింగ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలి భర్త సుమన్ ఎస్సై వెంకటేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు.

### మండల కమిటీ ఎన్నిక

**భూపాలపల్లి రూరల్:** భూపాలపల్లి మండల కాకతీయ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీ మంగళవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా కారుకూరి సతీష్, ప్రధాన కార్యదర్శిగా సకినాల వెంకటేశ్, కోశాధికారిగా కారుకూరి శ్రీనివాస్ తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లు నేరెళ్ల శ్రీనివాస్, రంగు రవీందర్, రవికుమార్ ఉన్నారు.

# కాల్వకు మరమ్మతులు


రాచపల్లి వద్ద కెనాల్‌కు పడ్డ గండి



కాల్వకు మరమ్మతు చేయిస్తున్న రైతులు

- పాలెం ప్రాజెక్టు కాల్వకు గత ఏడాది వర్షాలకు పడిన గండ్లు
- పట్టించుకోని అధికారులు
- సొంత డబ్బులతో మరమ్మతు చేసుకున్న రైతులు

**వెంకటాపురం(కె):** మండల పరిధిలోని రాచపల్లి గ్రామ సమీపంలో పాలెం ప్రాజెక్టు కెనాల్ కాల్వకు గత ఏడాది వర్షాలకు గండ్లు పడ్డాయి. మరమ్మతు చేయించాలని ప్రాజెక్టు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు, రైతులు ఆరోపిస్తున్నారు. కాగా, ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్న అధికారులు కెనాల్ మరమ్మతులపై దృష్టి సారించడం లేదని వాపోతున్నారు. కెనాల్‌కు పడిన గండ్లతో కాల్వ కింద ఉన్న పొలాల్లో నీరు చేరడంతోపాటు ఇసుక మేటలు వేస్తున్నాయి. అధికారులు స్పందించకపోవడంతో గ్రామంలోని రైతులు అందరు కలిసి రూ.500 చొప్పున డబ్బులు వసూలు చేసుకొని మరమ్మతు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి కెనాల్‌కు గండ్లు పడకుండా శాశ్వత పరిష్కారం చూసేలా చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

#### పట్టించుకోవడం లేదు..


రాచపల్లి గ్రామ సమీపంలో కెనాల్‌కు గండ్ల పడ్డాయని మరమ్మతులు చేయించాని అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదు. గండ్లు పడటంతో పంట పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– సమ్మయ్య, రాచపల్లి, మాజీ సర్పంచ్

#### మరమ్మతులు చేసుకున్నాం..


అధికారులు పట్టించుకోకపోతే రైతులందరం కలిసి సొంత ఖర్చులతో కాల్వను మరమ్మతు చేసుకుంటున్నాం. మళ్లీ వరదలు వస్తే గండ్లు పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కెనాల్‌కు గండ్లు పడకుండా పరిష్కారం చూపించాలి.

– రాంబాబు రైతు

## ఆదివాసీల సాగు భూములకు పట్టాలివ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ములుగు రూరల్:** మండలంలోని రాయినిగూడెంలోని ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ.. రాయినిగూడెం ఆదివాసీలు 111, 112 సర్వే నంబర్లలో 37 ఎకరాల భూమిలో 31 మంది 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని అన్నారు. కాగా, ఆ భూమిని వారసుల పేరుతో గిరిజనేతరులు ఆదివాసీలను వేదింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆదివాసీలకు పట్టాలు ఇచ్చి గిరిజనేతరులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ, పోతన్న, సమ్మయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

- ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్

**వాజేడు:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురంలో అభయమిత్ర కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం యువకులతో మాట్లాడారు. యువత గంజాయి అమ్మడం, సేవించడం చేయొద్దన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్లును అందజేశారు.

# టేకు కలప స్వాధీనం


టేకు దుంగలు చూపెడుతున్న అధికారులు

**వాజేడు:** బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు దూలాపురం రేంజ్ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ బాలకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..వెంకటాపురం(కె) మండలం నుంచి ఏటూరునాగారం మండలం వైపు బొలేరో వాహనంలో టేకు దిమ్మెలను తరలిస్తున్నారనే పక్కా సమాచారం అందింది. దీంతో బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గణపురం గ్రామం వద్ద అటవీశాఖ సిబ్బంది వాసు, లలిత, బేస్ క్యాంపు సిబ్బంది కాపుకాసి పట్టుకున్నారు. బొలేరో వాహనంలో కింద టేకు దిమ్మెలను ఉంచి పైనుంచి ఉనుక బస్తాలను వేసి దుంగలను కనపడకుండా జాగ్రత్త పడ్డారు. ఉనుక బస్తాలను తొలగించడంతో టేకు దుంగలు కనపడగానే స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బొలేరో వాహనం, అందులోని 8 టేకు దిమ్మెలను వెంకటాపురం(కె) అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్వో బాలకృష్ణ తెలిపారు. టేకు కలప విలువ రూ. 3.10 లక్షల వరకు ఉంటుందని రేంజర్ తెలిపారు. వాహనంలోని వ్యక్తులు పరారయ్యారని తెలిపారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- పస్రా ఎస్సై అచ్చ కమలాకర్


సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్సై

**గోవిందరావుపేట:** సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామంలోని వ్యాపారస్తులు మోడెం రమేశ్, తాళ్ల సతీష్, బద్దం మల్లారెడ్డి ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను మంగళవారం ఎస్సై పరిశీలించి మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామంలోని వ్యాపారస్తులందరూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

- వైద్యాధికారి ప్రణీత్‌కుమార్


కొండాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఏటూరునాగారం:** టీబీ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండాయిలో టీబీ ముక్త్ అభ్యన్ (క్షయవ్యాధి)పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ ఊపిరిత్తితులకు సోకుతుందన్నారు. రెండు వారలపైపడిన దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, సాయంత్రం సమయంలో జ్వరం రావటం వ్యాధి లక్షణాలన్నారు. కాగా, 40 మంది తెమడాను శాంపిల్ పరీక్ష నిమిత్తం కోసం ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రికి పంపించామన్నారు. అలాగే అనుమానం ఉన్న 8 మందికి ఎక్స్‌రేలను సామాజిక ఆస్పత్రిలో తీయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, టీబీ జిల్లా కోఆర్డినేటర్ రాజు, ఏఎన్ఎం సమ్మక్క, ఆశాలు లక్ష్మీ, జ్యోతి, సునీత, భాగ్య లక్ష్మీ, విగ్నేష్ పాల్గొన్నారు.

# వ్యాధులపై అప్రమత్తత అవసరం


చెరుపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి తరుణ్


వాజేడు: పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాహిల్

- వైద్యాధికారి తరుణ్

**మంగపేట:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి తరుణ్ అన్నారు. మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని చెరుపల్లి(కొత్తపేట)లో వైద్యాధికారి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న 11 మందికి ఆర్‌డీటీ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ముత్తమ్మ, ఏఎన్ఎం మమత, ఆశ వర్కర్లు విజయలక్ష్మి, చంద్రవాణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

**వాజేడు:** వర్షాకాలంలో వ్యాధులపై జాగ్రత్త అవసరమని పేరూరు వైద్యాధికారి రాహిల్, మాతా శిశు సంరక్షణ వైద్యాధికారిని యోషిత అన్నారు. మండల పరిధిలోని కడేకల్, చింతూరు గ్రామాల్లో రాహిల్, జంగాలపల్లి, ఇప్పగూడెం గ్రామాల్లో యోషిత సర్వే చేసి వైద్య శిబిరాలను నిర్వహించారు. కడేకల్ గ్రామం మలేరియా ప్రభావితం కావడంతో గ్రామంలోని 150 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. చింతూరు, జంగాలపల్లి, ఇప్పగూడెం గ్రామాల్లో రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వైద్య సిబ్బంది వేణుగోపాల్ కృష్ణ, కోటిరెడ్డి, శారద, శ్రీను, జయంతి లాల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

#### ఆరోగ్య మహిళా కేంద్రంలో..


పరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతి

**వెంకటాపురం(కె):** మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యాధికారి జ్యోతి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 71 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం మండల పరిధిలోని నూగూరు, మరికాల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భాస్కర్, పవన్ కల్యాణ్, స్నేహ, మనోహర్, సత్యనారాయణ, సిబ్బంది యాకమ్మ తదితరులు ఉన్నారు.

## 24న మంద కృష్ణమాదిగ పర్యటన


మాట్లాడుతున్న విజయ్

**ములుగు రూరల్:** ములుగులో ఈ నెల 24న నిర్వహించే మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుకు రూ.6 వేలు, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. నాయకులు నర్సయ్య, శ్యాంబాబు, శ్రీనివాస్, సుజాత, రవి దేవేందర్ తదితరులు ఉన్నారు.

## లింగ వివక్ష చూపొద్దు

**రేగొండ:** ఆడమగ సమానమేనని లింగ వివక్ష చూపొద్దని మహిళా సాధికారత ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ అనూష అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావోతో ఆడపిల్లలకు భరోసా లభిస్తుందన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలు ఆపద సమయంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, డీహెచ్ ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ మమత, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గిరిధర కృష్ణ, సీసీ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్ రజియాబేగం, మహిళా సంఘం సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

- ఎస్సై దానరి సుధాకర్


టేకుమట్ల: మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్


రేగొండ: మాట్లాడుతున్న ఎస్సై సందీప్‌కుమార్

**టేకుమట్ల:** ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై దానరి సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ట్రాక్టర్ డ్రైవర్, యజమానులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి టేకుమట్ల, కాల్వపెల్లి, మొగుళ్లపల్లి ఇసుక రిచ్‌ల నుంచి తీసుకోవాలన్నారు. అనుమతులు లేని ఇసుక రిచ్‌ల నుంచి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సెలవు రోజుల్లో ఇసుక రవాణా పూర్తిగా నిలిపి వేయాలని, నిర్ధేశించిన ధరలకే లబ్ధిదారులకు ఇసుకను అందించాలని అన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపే రవాణా చేసుకోవాలని సూచించారు.

**రేగొండ:** నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు తెలిపిన ధరల ప్రకారం ఇసుక సరఫరా చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావులతో కలిసి ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ అవసరాల నిమిత్తం అనుమతులు ఇచ్చిన మూడు ఇసుక రీచ్‌ల నుంచే ఇసుక తరలించాలని తెలిపారు. ఇసుక తరలించే ట్రాక్టర్ యజమాని వాహన సంబంధిత పత్రాలు కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గం దాటి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## బీఆర్ఎస్ హయాంలోనే ఇసుక దందా

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

**టేకుమట్ల:** బీఆర్ఎస్ హయాంలోనే ఇసుక దందా జరిగిందని, దందా చేసిన నాయకులే రోడ్డుపై ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక క్వారీల వల్ల అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్న సంగతి మర్చిపోయారా అని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుంటే ఓర్చుకోలేని బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైనాల రవీందర్, నాంపెల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్, కత్తి సంపత్, చిరంజీవి, వంగ నరేష్, వంగ కుమారస్వామి, అల్లం ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

**పది సంవత్సరాలైనా పూర్తికాని అంగన్‌వాడీ కేంద్ర భవనం**

- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు


పిల్లర్ల దశలో నిలిచిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

**రేగొండ:** కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకొడేపాకలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి. పదేళ్ల క్రితం రూ.12 లక్షల అంచనా వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అయితే బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మించి కాంట్రాక్టర్ పనులను ఆపేశాడు. అప్పటి నుంచి భవన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆ స్థలంలో చెట్లు పెరిగి అపరిశుభ్రంగా తయారై విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించి పనులు చేట్టడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీకి పక్కా భవనం లేకపోవడంతో చాలా కాలంగా పాఠశాల భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

#### నిర్మాణం చేపట్టాలి


పదేళ్ల క్రితం మంజూరైన అంగన్‌వాడీ భవనం ఇప్పటికి పూర్తి కాలేదు. బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మించి ఆపేశారు. చాలా కాలంగా అంగన్‌వాడీ కేంద్రం పాఠశాల గదిలోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా వెంటనే నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

– పైళ్ల క్రాంతికుమార్, సీపీఐ నాయకుడు, చిన్నకొడేపాక

## ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నాయకులు

**రేగొండ:** మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన సింగరి కిరణ్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. దీంతో మంగళవారం ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బండ రఘోత్తంరెడ్డి బాధితుడిని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశాడు. సంఘం మండల అధ్యక్షుడు జంబుల రఘు, టేకుమట్ల మండల అధ్యక్షుడు దాసారపు సదానందం, జిల్లా కోశాధిరి రాకేశ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్, కోశాధికారి బండి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.